ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, బాసుహన్మంతు, వెంకట్రాములు
- కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

గద్వాల, ఆగస్టు 22: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ఉద్యమాలు చేస్తామని బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు డాక్టర్ విజయ్‌కుమార్, బాసు హన్మంతు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా నిర్వహించి ఏవో భద్రప్పకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు తెలంగాణ తల్లిని అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంతోపాటు జిల్లాలో 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం రుణమాఫీ పూర్తైందని గారడీ మాటలు చెబుతుంటే మంత్రులు మనిషికో మాట చెబుతూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. అనేక ఆంక్షలు పెట్టి రుణమాఫీకి నోచుకోని రైతులకు ప్రభుత్వం, సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిరైతుకూ రుణమాఫీ చేస్తామని ప్రకటన చేయాలని.. అప్పటిదాకా ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. గద్వాలలో కారు గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తక్షణమే పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మాజీ జెడ్పీటీసీ బాసుశ్యామల, మద్దిలేటి, బీచుపల్లి, జనార్దన్‌రెడ్డి, గోవర్ధన్, మల్లికార్జున, మక్బూల్, జయరామిరెడ్డి, బీచుపల్లి, శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు సత్యారెడ్డి పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేయాలి

: బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కురువ పల్లయ్య

అయిజ, ఆగస్టు 22: అసెంబ్లీ ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే బేషరతుగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాల్సిందేనని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలో రైతురణంలో భాగంగా తెలంగాణ చౌరస్తా నుంచి కర్నూలు-రాయిచూర్ చౌరస్తా వరకు రైతులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తామని చెప్పిన రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వక రైతులను అరిగోస పెడుతుందన్నారు. 30శాతం రైతులకు కూడా రుణమాఫీ అందలేదన్నారు. రూ.31వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి, రూ.17వేల కోట్లు చేసి చేతులు దులుపుకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా రుణమాఫీ చేయకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ మహిళా నాయకురాలు ప్రేమలత, మున్సిపల్ చైర్మన్ దేవన్న, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జమాలుద్దీన్, మేరమ్మ, శివకుమార్, భద్రయ్య, ముక్తర్, మల్లేశ్, భీం దాస్, మహేశ్, మత్తలి, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు మండలంలో..

గట్టు, ఆగస్టు 22: ఎలాంటి ఆంక్షలు లేకుండా వంద శాతం రుణమాఫీ అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదని మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల పేర్కొన్నారు. రుణమాఫీపై కాంగ్రెస్ చేస్తున్న ధోకాకు నిరసనగా.. కర్నూలు-రాయచూర్ అంతర్‌రాష్ట్ర రహదారిపై బలిగేర స్టేజీ వద్ద మాజీ జెడ్పీటీసీ, మాజీ సర్పంచ్ బాసు హనుమంతు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా చాలాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు జోక్యం చేసుకుని శ్రేణులకు నచ్చచెప్పారు. అనంతరం శ్రేణులు గట్టుకు చేరుకుని రుణమాఫీపై రైతులు పడుతున్న ఇబ్బందులపై ప్లకార్డులు ప్రదర్శించిన నిరసన తెలిపారు. తాసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బాసు శ్యామల తెలుగుతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామేల్, నాయకులు కిష్టప్ప, రామునాయుడు, రాజునాయుడు, బాసు గోపాల్, వెంకటేశ్, తిమ్మప్ప గౌడ్, రాయపురం వీరేశ్, బొజ్జయ్య, రాజగోపాల్, కృష్ణ, గురు, ఆంజనేయులు, ముని పాల్గొన్నారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, ఆగస్టు 23: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా నాయకురాలు బాసు శ్యామల హాజరై మాట్లాడారు. రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేసేదాకా పోరాటంఆగదని హెచ్చరించారు. అనంతరం తాసీల్దార్ మోహినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరుమలేశ్, పరశురాముడు, గంగన్న, బాసుగోపాల్, తిమ్మప్ప, బొజ్జయ్య రాముడు, రైతులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో..

గోపాల్‌పేట, ఆగస్టు 22: గోపాల్‌పేట, రేవల్లి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. అనంతరం తాసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి, రేవల్లి తాసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భీమయ్య, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, రైతుబంధు మండలాధ్యక్షుడు తిరుపతియాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, రఘురామారావు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, రైతుబంధు అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో ..

పెబ్బేరు, ఆగస్టు 22: పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, రైతులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ పెబ్బేరు మండలాధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు దిలీప్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. తాసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి పాల్గొని తాసీల్దారు లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, గోవిందునాయుడు, వెంకటన్నగౌడ్, మధు, వీరస్వామి, వేణుగోపాల్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురంలో నిరసన..

శ్రీరంగాపురంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, తాసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం నాయుడు, నాయకులు పృథ్వీరాజు, గౌడానాయక్, వెంకటస్వామి, జలీల్, పర్వతాలు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడి మండలంలో..

పెద్దమందడి, ఆగస్టు 22: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతురణంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జి తాసీల్దార్ చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ దయాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వేణు, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జానకిరాములు, నాగేంద్రయాదవ్, సేనాపతి, కురుమూర్తి, చెన్నయ్య, రఘువర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, సురేశ్, అంజి, రైతులు తదితరులు ఉన్నారు.

అయిజ: రుణమాఫీ చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు, రైతులు

గట్టు : కర్నూలు-రాయిచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై బలిగేర చెక్‌పోస్ట్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మల్దకల్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రేవల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీరంగాపురంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెద్దమందడి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, రైతులు

మాజీ ఎంపీ సోదరుడికి నివాళి

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 22: మండలంలోని కానాయపల్లికి చెందిన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు రావుల వెంకట్‌రంగారెడ్డి ప్రథమ వర్ధంతిని గురువారం స్వగ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట సుదర్శన్‌రెడ్డి, రాములు, గోవర్ధన్, రాజు ఉన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

కొత్తకోట, ఆగస్టు 22: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ పథకాన్ని ఏకకాలంలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని రైతులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 74లక్షల మంది రైతులు ఉండగా 42లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, ఇంకా 32లక్షల మంది రైతులకు రుణమాఫీ అందలేదన్నారు. వీపనగండ్ల మండలంలో 4వేల రైతుల బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని, అందులో 2వేల మంది రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. పాన్‌గల్ మండలంలో 3వేల రైతు ఖాతాలు ఉండగా, కేవలం 1,300 మందికి మాఫీ అయిందన్నారు. దీనిని బట్టి ఎక్కడా పూర్తిస్థాయిలో మాఫీ కాలేదన్నారు. రైతు రుణమాఫీ ఖాతాలకు 31నిబంధనలు పెట్టిందని, వాటిని సడలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతు రుణమాఫీకి బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతూ రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరణిలో ఫోర్జరీ జరిగిందని వాటిని మార్చుకునేందుకు భూమాత పేరు మీద రికార్డులు మార్చారని, ఈ సమస్య కూడా పెండింగ్‌లో ఉందన్నారు. కొత్తగా బ్యాంక్‌లో రైతులకు రుణాలు ఇవ్వడం లేదని వెంటనే రైతులకు పంటరుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, నిక్సన్, కుర్మన్న, యాదయ్య, రాములు, వెంకటేశ్, నాగేంద్రం, రాజు, శాంతన్న పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఆగస్టు 22: ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అక్రమ లే అవుట్స్, ప్లాట్లను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి జిల్లా స్థాయి లే అవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో టీజీబీపాస్ ద్వారా డీటీసీపీ లే అవుట్‌లు, ప్లాట్ల ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. అక్రమ లే అవుట్‌లు, ప్లాట్ల ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను క్లస్టర్‌లుగా విభజించుకొని ఎల్‌టీపీసీలు డెవలపర్లు, బిల్డర్లతో సమావేశం కావాలని సూచించారు. అక్రమ లే అవుట్, ప్లాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో మ్యాపింగ్ చేసుకొని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో కలిపి దాదాపు 45వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్రమబద్ధీకరించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వారంలో కనీసం 100 పూర్తి చేయాలన్నారు. వనపర్తిలో వారానికి 200 పూర్తిచేయాలని లక్ష్యం నిర్ధారించారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ డీఈ సీతారామస్వామి, మున్సిపల్ కమిషనర్లు టీపీలు, డీటీలు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనుల పరిశీలన

వనపర్తి టౌన్, ఆగస్టు 22: జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో సీఎం ప్రత్యేక నిధుల నుంచి నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలను కలెక్టర్ ఆదర్శ్‌సురభి గురువారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని 22వ వార్డు సాయికృష్ణ కాలనీ నుంచి తాళ్ల చెరువు వరకు, తాళ్లచెరువు పచ్చదనం కోసం రూ.కోటి4లక్షలతో పనులు చేపట్టగా.. ఫైనల్ బిల్లు నిమిత్తం, ఉమర్ కట్టెల మిషన్ నుంచి జమ్మిచెట్టు వరకు వేసిన సీసీ గ్రాంట్ రూ.29లక్షల పనులు, ఎంబీ రికార్డులను పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న మారెమ్మకుంట వద్ద సర్వేనెంబర్ 41 మారుతీనగర్‌లో వేసిన లే ఔట్‌ను పరిశీలించారు. లే ఔట్‌లోని 33, 40ఫీట్ల రోడ్లను వెంటనే ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని యజమానికి ఆదేశం చారు. క్రమబద్ధీకరణ ఇచ్చే వరకు మిగిలిన ప్లాట్లు అమ్మొద్దని డీపీవోను ఆదేశించారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

వచ్చే వినాయక నిమజ్జనానికి నల్ల చెరువు దగ్గర ఉన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. చెరువులో ఉన్న చెత్తను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, డీటీ మధుసూదన్, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజినీర్లు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

'ఆర్‌వోఆర్'పై సలహాలు స్వీకరించాలి

ప్రభుత్వం ధరణి స్థానంలో తెచ్చిన ఆర్‌వోఆర్ బిల్లు 2024పై ఈనెల 24న సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఆర్‌వోఆర్ బిల్లుపై జిల్లాలోని రెవెన్యూ, రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, బోధనా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు తదితర నిపుణులతో 24న శనివారం ఉదయం 11గంటల నుంచి కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందరూ హాజరై బిల్లుపై అనుమానాలను నివృత్తి చేసుకో వడమే కాకుండా తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సలహాలు, సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

భారత్‌మాలకు సహకరించాలి

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్


అధికారులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గట్టు, ఆగస్టు 22: అభివృద్ధి పనులకు ఎలాంటి పరిస్థితుల్లో ఆటంకం కలిగించొద్దని.. భారత్‌మాల రోడ్డు నిర్మాణానికి నిర్వాసిత రైతులు సహకరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. తాసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ అధికారులు, నిర్వాసిత రైతులతో గురువారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైవే అథారిటీ అధికారుల ద్వారా రహదారి నిర్మాణ సంబంధిత భూముల వివరాలను మ్యాపింగ్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌మాల నిర్వాసిత రైతులకు నష్టపరిహారం అందించడంతోపాటు మిగులు భూములకు సర్వీసు రోడ్లు, బ్రిడ్జి ఏర్పాటుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రైతుల కోరిక మేరకు రెండో విడుతగా పదిరోజుల్లో డబ్బులు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మాచర్ల నుంచి ఆరగిద్దకు రోడ్డు లింక్ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ సరితారాణి, ఎన్‌హెచ్ఏఐ మేనేజన్ కోటబాబు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

గట్టు, ఆగస్టు 22: హాజరును పెంచితేనే పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించవచ్చని, ఈ దిశగా ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. స్థానిక టీజీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల/కళాశాలలో 'అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం'లో భాగంగా 'ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద దేశంలోని 500మండలాల్లో గట్టు మండలం ఒకటని గుర్తు చేశారు. ప్రత్యేక ప్రయత్నాలతోనే డ్రాప్ అవుట్స్ తగ్గించవచ్చన్నారు. దీనికి ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందిస్తే తమ సహకారం ఉంటుందన్నారు. బడీడు పిల్లలను పొలం పనులకు పంపిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకుని ముందుకు సాగితే మంచి ఫలితాలు ఉం టాయన్నారు. అవసరమైన పాఠశాలకు విద్యావలంటీర్లను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి పెడుతానని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, తాసీల్దార్ సరితారాణి, ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి హృదయరాజు, మండల ప్రత్యేకాధికారి ప్రియాంక, జిల్లా సంక్షేమాధికారిణి సుధారాణి, డీసీపీవో నర్సింహులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.

నిత్య పూజలు నిర్వహించాలి

అయిజ, ఆగస్టు 22 : ధూపదీప నైవేద్య గౌరవ వేతనం అందుకుంటున్న ప్రతి ఆలయంలో నిత్య పూజ కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలని జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ అర్చకులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని పలు ఆలయాలను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇన్నోవా

మానవపాడు, ఆగస్టు 22 : బైక్‌ను ఇన్నోవా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై చంద్రకాంత్ కథనం ప్రకారం బల్గెర గ్రామానికి చెందిన ఉరుకుంద భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి బైక్‌పై మండలంలోని జల్లాపురం గ్రామంలో కూలి పనులకు బయలుదేరాడు మానవపాడు స్టేజి వద్ద 44వ జాతీయ రహదారిని దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇన్నోవా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఉరుకుందుతోపాటు భార్యాపిల్లలకు గాయాలయ్యాయి. బైక్ నడిపే వ్యక్తి నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకున్నదని స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

ఆత్మకూరు, ఆగస్టు 22: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని తిప్డంపల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై నరేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాతె బాలయ్య రెండో భార్య మూడో కూతురు సువర్ణ (38) గురువారం తెల్లవారుజామున పాము కాటేసినట్లు గుర్తించి పీహెచ్‌సీకి తరలించారు. నోట్లో నుంచి నురగ రావడంతో ఆత్మకూరు దవాఖానకు తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో డ్రైవర్ మృతి

కొత్తకోట, ఆగస్టు 22: ముందు వెళ్తున్న లారీని కంటైనర్ ఢీకొని డ్రైవర్ మృతి చెందిన ఘటన పట్టణ సమీపంలోని టెక్కలయ దర్గా వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్ల వారు జామున చోటుచేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం. కర్నూల్ వైపు వెళ్తున్న లారీని యూపీకి చెం దిన కంటైనర్ వెనుక నుంచి ఢీకొట్టగా డ్రైవర్ శివనరేశ్(40) అక్కడికక్కడే మృతిచెందాడు. కంటైనర్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి బైండోవర్

ఖిల్లాఘణపురం, ఆగస్టు 22: మండలంలోని మామిడిమాడకు చెందిన గోవర్ధన్‌రెడ్డిని గురువారం తాసీల్దార్ పాండునాయక్ ఎదుట ఎస్సై శ్రీహరి బైండోవర్ చేశారు. గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి గతంలో పంచాయతీ కార్యదర్శి వద్ద దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదైంది. ఎన్నికల సమయంలో గొడవలకు కారణమవుతాడనే ఉద్దేశంతో తాసీల్దార్ ఎదుట రూ.లక్ష, ఏడాది కాల పరిమితితో బైండోవర్ చేయగా.. అతనిలో మార్పు రాకపోగా.. కులాల మధ్య గొడవలు వచ్చేలా, గ్రామస్తుల మనోభావాలు దెబ్బతినేలా వాట్సాప్‌లో రెచ్చగొట్టే మెసేజ్‌లు పెట్టడంతో వెంకట్రావుపై మరో కేసు నమోదైంది. దీంతో గురువారం తాసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. అతని పేదరికం కారణంగా రూ.లక్షకుగానూ రూ.15వేల జరిమానా విధిస్తూ బైండోవర్ చేసినట్లు చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి

గద్వాలటౌన్, ఆగస్టు 22: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సిద్ధప్ప సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం జిల్లాలోని ప్రైవేట్ డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, తన్వీర్, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణుడు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

హార్టికల్చర్ పంటల పరిశీలన

మల్దకల్, ఆగస్టు 22: మండలంలోని తాటికుంటలో రైతు విష్ణుమూర్తి భూమిలో సాగు చేసిన హార్టికల్చర్ పండ్ల తోటల పెంపకాన్ని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి అధికారులతో వన మహోత్సవం పై మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో అమ్మపేరు మీద ఓ చెట్టు నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా కేజీబీవీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఏపీవో సుజాత, ఈసీ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్, పాల్గొన్నారు.

బూట్లు, సాక్సులు అందజేత

కొత్తకోట, ఆగస్టు 22: మండలంలోని కానాయపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 110 మంది విద్యార్థులకు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి బూట్లు, సాక్సులు అందజేశారు. రావుల సోదరుడు వెంకట్‌రంగారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేను కూడా ఇదే పాఠశాలలోనే చదువుకున్నానని, ప్రభుత్వ పాఠశాలలో చదువున్నవారు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల సుదర్శన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అమరచింత, ఆగస్టు 22: అర్ధరాత్రి మద్యం తాగి అకారణంగా ఇంటి ముందు కూర్చున్న తనపై రాయితో దాడి చేసి తల పగలగొట్టిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు జోగు వెంకటన్న విజ్ఞప్తి చేశాడు. గురువారం ఆయన ఠాణా ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. నాగల్‌కడ్మూర్‌లో ఇంటి పక్కనే ఉన్న చేపల పద్మ, వెంకటన్న భార్యాభర్తలు మంగళవారం రాత్రి 11గంటల సమయంలో అకారణంగా దూషిస్తూ రాయితో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పుడే అమరచింత పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇప్పుటి వరకు కేసు నమోదు కాలేదని, దాడిచేసిన వారిపై పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చేపల వెంకటన్న, పద్మపై కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై సురేశ్ తెలిపారు.

50మిల్లీమీటర్ల వర్షపాతం

మల్దకల్, ఆగస్టు 22: మండలంలో గురువారం తెల్లవారు జామున భారీవర్షం కురిసింది. మండలంలో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రెండు రోజులుగా వర్షం కారణంగా మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రాత్రివేళల్లో బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. తరచూ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నోనిపల్లిలోకి వరద నీరు వెళ్లొద్దు

గట్టు, ఆగస్టు 22: వరద నీరు ఎట్టి పరిస్థితుల్లో కూడా చిన్నోనిపల్లిలోకి వెళ్లకుండా అవసరమయ్యే చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ సరితారాణి ఇరిగేషన్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. వరద నీరు చిన్నోనిపల్లి పరిసర ప్రాంతానికి చేరుకున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె గ్రామాన్ని గురువారం పరిశీలించారు. అక్కడ పరిస్థితిని ఫోన్ ద్వారా ఆర్డీవో రాంచందర్‌కు తెలియజేశారు. రిజర్వాయర్ దిగువ భాగాన గండి ఏర్పాటు చేసి నీటిని దిగువకు వదలాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, ఆర్ఐలు రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి 9నెలల జైలుశిక్ష

వనపర్తి టౌన్, ఆగస్టు 22: పలు దొంగతనాల కేసులో నిందితుడికి రెండో అదనపు జడ్జి జానకి 9నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించారు. ఎస్పీ గిరిధర్ కథనం ప్రకారం.. గోపాల్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవరి 23న కలర్ టీవీ, ఫ్యాన్లు ఇతర వస్తువులు అపహరణకు గురికాగా.. హెచ్ఎం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా.. ఎస్సై హరిప్రసాద్ సాక్షులను అదనపు జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో గ్రామానికి చెందిన జనార్దన్ నేరం ఒప్పుకోవడంతో జడ్జి తీర్పునిచ్చారు. నేరం రుజువు చేసినందుకు సీఐ, ఎస్సై, కోర్టు కానిస్టేబుల్ రమేశ్‌ను ఎస్పీ అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-325792-All

FARM PLOTS SALE
★బాలానగర్ జడ్చర్ల బెంగళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో & యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ఫ్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి॥ 7780483434. NT-332573

PLOT FOR SALE
★జడ్చర్ల టౌన్‌లో @ DTCP, RERA అప్రూవ్డ్ వెంచర్‌లో వెంటనే ఇళ్ళు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్, సీసీ రోడ్స్, బ్యాంక్ లోన్‌తో కలవు. 6309977999 NT- 40

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SSC MEMO MISSING
నేను అనగా MD. SARFARAZ AHMED S/o MD. YOUNUS AHMED, Age: 27 Yrs, R/o Gadwal Jogulamba Gadwal District, TGS, తేది: 20-08-2024 రోజు మా ఇంటి నుండి సాయి జిరాక్స్ వెళ్ళే దారిలో నా యొక్క SSC Memo ఒరిజినల్ ఉన్న ప్లాస్టిక్ కవర్ పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది సెల్ నంబర్‌ను సంప్రదించి తెలియజేయగలరు. 7013079757

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794